క్లుప్తంగా

ఎరువుల దుకాణంలో తనిఖీలు



మునగపాకలోని ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలోని ప్రైవేటు ఎరువుల **దుకాణంలో** బుధవారం విజిలెన్స్ అధికారులు **తనిఖీలు** నిర్వహించారు. మెయిన్ **రోడ్డులోని శ్రీసాయితేజ** ఎరువుల దుకాణంలో **ఎరువుల** నిల్వలు, రికార్డులను విజిలెన్స్ **సీఐ అప్పలనాయుడు** పరిశీలించారు. **లైసెన్స్, బిల్ పుస్తకాలు**, స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ **చేశారు. ఎరువులను** అధిక ధరలకు విక్రయిస్తే **చర్యలు** తప్పవని హెచ్చరించారు. **ఈ కార్యక్రమంలో** మండల వ్యవసాయాధికారి **సీహెచ్.జ్యోత్స్న కుమారి**, తదితరులు **పాల్గొన్నారు.**

పాటిపల్లిలో సోలార్ ప్లాంట్ స్థల పరిశీలన



సోలార్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి పంచాయతీ పరిధిలో సోలార్ ప్లాంట్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం అధికారులు పరిశీలించారు. సర్వే నంబరు 79లో పదెకరాల స్థలాన్ని సోలార్ ప్లాంట్‌కు కేటాయిస్తూ పంచాయతీ తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ డీఈ సురేష్, ఏఈ జగదీష్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో వ్యవసాయ అవసరాల కోసం సక్రమంగా విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శి రాజు, వీఆర్వో వెంకటరమణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

డెయిరీ ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం

మునగపాక: తోటాడ పంచాయతీ పరిధిలో విశాఖ డెయిరీ ఉత్పత్తుల కేంద్రాన్ని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చి నాటికల్లా ఉమ్మడి 5 జిల్లాల్లో 300కు పైగా ఉత్పత్తుల కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ నెల నుంచి చిత్తూరు జిల్లాలో సుమారు పది వేల లీటర్ల వంతున 15 బల్క్ కూలర్ల నిర్వహణను ప్రభుత్వం విశాఖ డెయిరీకి అప్పగించిందన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, చీఫ్ ఆపరేటింగ్ అధికారి కేవీ ప్రసాద్, మార్కెటింగ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ హరి, చీఫ్ మేనేజర్ సోమునాయుడు, యూనిట్ మేనేజర్ శరగడం రమణ, సర్పంచ్ దొడ్డి మంగవేణి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

8న దివ్యాంగులకు ఉపకరణాల గుర్తింపు శిబిరం

మునగపాక: యలమంచిలిలో ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల గుర్తింపు శిబిరం ఈ నెల 8న జరుగుతుందని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడులు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగి పాఠశాలల్లో చదువుకుంటున్న దివ్యాంగ విద్యార్థులకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, రొలేటర్స్, బ్యాటరీ ట్రై సైకిల్స్ వంటి ఉపకరణాలు అందజేస్తామన్నారు. శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తమ వద్ద ఉన్న ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



చినబొడ్డేపల్లిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోటవురట్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని సర్పంచ్ పైల శివరామ్ తెలిపారు. చినబొడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా లభించే కూరగాయలు, పప్పు దినుసులతో పౌష్టికాహారాన్ని తయారు చేసి స్టాల్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందుతోందన్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. సూపర్‌వైజర్ హైమావతి మాట్లాడుతూ ఇక్కడి పౌష్టికాహార వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్



మరమ్మతులకు గురైన ఫ్రూట్ రైపెనింగ్ మెషిన్

అక్కరకు రాని గోడౌన్!

భారంగా మార్కెట్ యార్డ్ గోదాము అద్దె ▪ నెలకు రూ.17,562గా నిర్ణయం ▪ ఆసక్తి చూపని రైతులు

పాయకరావుపేట: వ్యవసాయ మార్కెట్ యార్డ్ గొడౌన్ అక్కరకు రాకుండాపోయింది. మండలంలో పీఎల్‌పురం గ్రామంలో ఉన్న ఈ గోదాము అద్దె భారంగా మారడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. రైతులు తమ పంటలను నిల్వ చేసుకోవడానికి, పండించే పండ్లను మగ్గపెట్టుకునేందుకు అనువుగా నిర్మించిన ఈ గోదాము నిరుపయోగంగా మారింది. ఇక్కడ మార్కెట్ కమిటీ యార్డ్‌లో రైతులు తమ పంటలను నిల్వ చేసుకోవడానికి వీలుగా గోదాము నిర్మించారు. రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఉన్నతాధికారులు ఈ గోదాములో ప్రైవేట్ వ్యక్తులు కూడా ధాన్యం, ఎరువుల నిల్వలతో పాటు మార్కెట్‌లో అమ్మకాలు జరిపే ఇతర పంటలను, వస్తువులను కూడా నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇందు కోసం నెలకు రూ.17,562 అద్దె నిర్ణయించారు. కానీ అంత మొత్తంలో అద్దె చెల్లించి గోదామును తీసుకోవడానికి ప్రైవేట్ వ్యాపారులు కూడా ఎవరూ ముందుకు రాలేదు.

పాడైన ఫ్రూట్ రైపెనింగ్ మెషిన్

రైతులు తమ తోటల నుంచి తీసుకొచ్చిన కాయలను మగ్గపెట్టడం కోసం ఏర్పాటు చేసిన మగ్గబెట్టే యంత్రం(ఫ్రూట్ రైపెనింగ్ మెషిన్) కూడా పాడై మూలకు చేరింది. దీంతో పచ్చికాయలు మగ్గపెట్టే గోదాము కూడా నిరుపయోగంగా ఉంది. అదే విధంగా యార్డ్‌లో ప్రతి ఆదివారం పశువుల సంతను నిర్వహించడం వల్ల రూ.4 వేలు నుంచి రూ.5 వేలు వరకు ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం పర్యవేక్షణ లేక గతం కన్నా పశువుల సంత ఆదాయం కూడా తగ్గిందని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై మార్కెట్ కమిటీ యార్డ్ కార్యదర్శి ఆర్.నాగకుమార్‌ను సంప్రదించగా.. యార్డ్‌లో ఉన్న



యార్డ్‌లో నిరుపయోగంగా ఉన్న గోదాము

గోదాము అద్దె నెలకు రూ.17,562గా నిర్ణయించడంతో ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. యార్డ్‌లో ఉన్న పచ్చి పంటలను మగ్గపెట్టే రిపెనింగ్ మెషిన్ పాడైందని, మరమ్మతులు చేపట్టడానికి టెండర్ పిలిచామన్నారు. త్వరలో మరమ్మతులు చేస్తామన్నారు. ప్రతి ఆదివారం పశువుల సంత ద్వారా యార్డ్‌కు ఆదాయం బాగానే వస్తుందని చెప్పారు.

గోదాము అద్దె అందుబాటులో ఉండాలి..



వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను రైతులు ఉపయోగార్థం సిద్ధంగా ఉంచాలి. గోదాము అద్దెను తగ్గించాలి. పచ్చిపంట నిల్వతో పాటు కాయలు మగ్గ పెట్టే యంత్రానికి మరమ్మతులు చేపట్టాలి. సాధారణ, సామాన్య రైతులకు అందుబాటులో ఉండే విధంగా గోదామును సిద్ధం చేయాలి.

–పెనుమత్స నాగేశ్వరరరావు,
మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, మంగవరం

డ్రోన్‌తో పొలం పనులు మరింత సులువు

కోటవురట్ల: డ్రోన్‌తో పొలం పనులు చేపట్టడం ద్వారా సమయం, డబ్బులు ఆదా అవుతాయని మండల వ్యవసాయాధికారి బి.సరోజిని తెలిపారు. మండలంలోని బి.కె.పల్లి, యండపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి వరి పొలాలను పరిశీలించారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించారు. డ్రోన్ సహాయంతో వరి చేలపై నానో యూరియా స్ప్రే చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రోన్ సహాయంతో ఎరువులు, పురుగుల మందులు స్ప్రే చేయడం వల్ల తగిన మోతాదులో పంటకు అందుతుందని తెలిపారు. సాగు చేసే రైతులంతా ఈ నెల 30వ తేదీలోగా ఈ–పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగన్న నాయుడు, రైతులు, ఏఈవో, సిబ్బంది పాల్గొన్నారు.



డ్రోన్ స్ప్రేపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి సరోజిని

10 మంది ఉపాధ్యాయులకు సత్కారం

యలమంచిలి రూరల్: మండలంలోని జంపపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన 10 మంది ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. సత్కారం పొందిన వారిలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏవీహెచ్ శాస్త్రి, ఉపాధ్యాయులు అప్పల సుబ్బారావు, కొయిలాడ రమణ, అప్పలనాయుడు, శివ, షబ్బీరు, శ్రీనివాస్, సుధాకర్, నాగరాజు తదితరులు ఉన్నారు. ఉపాధ్యాయులకు బదిలీ తప్పనిసరని, కానీ పనిచేసిన కాలంలో విద్యార్థులను ఎలా తీర్చిదిద్దామన్నదే శాశ్వతంగా నిలిచిపోతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవకీ నాయుడు, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు కనకారావు, స్టార్ బాయ్స్ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి పాల్గొన్నారు.



సత్కారం పొందిన ఉపాధ్యాయులు

చెర్లోపాలెం ఆరోగ్య కేంద్రం సందర్శన

మునగపాక: మండలంలోని చెర్లోపాలెం ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు సందర్శించారు. ఇక్కడ పలు పథకాల అమలు తీరుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు వైద్యపరంగా అందుతున్న సేవలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఆరోగ్యపరమైన సేవలందించాలన్నారు. సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డేటా మేనేజర్ వై.జనార్దన్, ఎంపీహెచ్‌ఈవో గుర్రం శ్రీనివాసరావు, హెచ్‌వీ బేగం, ఏఎన్ఎం కృష్ణవేణి, మంగతల్లి, శారదా, సంతోషికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ ఆర్.దేవి, వైద్య సిబ్బంది కళావతి, కిన్నెర, తదితరులు పాల్గొన్నారు.



చెర్లోపాలెం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు

పంట భూముల్లో రోడ్డు నిర్మించొద్దు

అచ్యుతాపురం రూరల్: చీమలాపల్లి రెవెన్యూ పరిధిలోని పంట భూముల్లో వీఎంఆర్‌డీఏ తలపెట్టిన రహదారి నిర్మాణ పనులను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చీమలాపల్లి సచివాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రైతులు వీఎంఆర్‌డీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం తప్పితే మరో పని చేసుకోవడం రాదని, భూములు కోల్పోతే తామంతా రోడ్డున పడిపోతామన్నారు. రైతుల అనుమతి లేకుండా భూముల్లో రాళ్లు పాతడంపై చీమలాపల్లి రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు.



చీమలాపల్లి సచివాలయ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పిస్తున్న శివ నాగేశ్వరరావు

దేవరాపల్లి: మూఢ నమ్మకాలను వీడి సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సైన్స్ అండ్ టెక్నాలజీ సబ్ కమిటీ స్టేట్ కన్వీనర్ ఆర్.శివనాగేశ్వరరావు సూచించారు. స్థానిక కైరళీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో లో కాస్ట్, నో కాస్ట్ సైన్స్ ప్రయోగాల వర్క్ షాప్‌ను బుధవారం నిర్వహించారు. విద్యార్థులకు సైన్స్‌పై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ప్రజల మూఢ విశ్వాసాలను ఆసరాగా చేసుకొని మాయలు, మంత్రాలు పేరిట దోపిడీ చేసే విధానంపై పలు సైన్స్ ప్రయోగాలు చేసి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. అద్భుతాలు, మహిమలు నమ్మి మోసపోకుండా సైన్స్ కోణంలో అర్థం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.త్రిమూర్తులురెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా పందిరి రాట మహోత్సవం



ఉమ్మలాడలో దుర్గాదేవి అమ్మవారి పందిరి రాట వేస్తున్న భక్తులు

మునగపాక: ఉమ్మలాడ పల్లపు వీధిలో దుర్గాదేవి అమ్మవారి పందిరి రాట మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా ఏటా పందిరి రాట వేయడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సమక్షంలో పందిర రాట వేసి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దలతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాల నిర్వాహకులపై కేసు



అశ్లీల నృత్య ప్రదర్శన నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: మండలంలోని ములకలాపల్లిలో ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా సోమవారం రాత్రి మహిళలతో అశ్లీల నృత్య ప్రదర్శన చేయించిన నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. అశ్లీల నృత్య ప్రదర్శనకు ఉపయోగించిన సౌండ్ సిస్టమ్ పరికరాలను పోలీసులు స్వాధీనపర్చుకున్నారు. బుధవారం ములకలాపల్లి గ్రామ పెద్దల సమక్షంలో నిర్వాహకులను సీఐ ధనుంజయరావు మందలించి, ఇకపై అలాంటివి పునరావృతం చేయవద్దని కౌన్సెలింగ్ చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధితోనే దేశ పురోగతి

అనకాపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం పురోగతి సాధిస్తుందని రోటరీ క్లబ్ విజయవాడ మాజీ గవర్నర్ సీహెచ్.కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక న్యూకాలనీ రోటరీ హాల్లో రోటరీ, జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. 40 మంది మహిళలకు మూడు నెలల పాటు కుట్టు మిషన్, ఫ్యాషన్ డిజైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఉగ్గిన శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వి.పి.ఎస్.ప్రకాశరావు, కోశాధికారి బి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై డ్రోన్ నిఘా

నర్సీపట్నం : ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆగతాయిల ఆట కట్టేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో డ్రోన్ నిఘా పెట్టామని టౌన్ సీఐ జి.గోవిందరావు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్ అవరణలో సిబ్బందితో కలిసి డ్రోన్ ఎగురవేసి పర్యవేక్షించారు. అల్లరి చిల్లరగా తిరుగుతున్న కొంతమంది యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి మందలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు విడిచి పెట్టినప్పుడు ఒక్కసారిగా విద్యార్థులంతా కాంప్లెక్స్‌కు వస్తున్నారని, ఈ సమయంలో విద్యార్థులకు ఆకతాయిల వల్ల ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి రోజు డ్రోన్ నిఘా కొనసాగుతుందని సీఐ తెలిపారు. విద్యార్థినుల పట్ల ఎవరైన అసభ్యకరంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



డ్రోన్‌తో ఆర్టీసీ పరిసరాలను పర్యవేక్షిస్తున్న సీఐ గోవిందరావు

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పాయకరావుపేట: మండలంలోని పెంటకోట, మాసాహేబుపేట గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. మండల వ్యవసాయ శాఖ అధికారి పి.ఆదినారాయణ మాట్లాడుతూ త్వరితగతిన ఈ పంట నమోదు పూర్తి చేయాలన్నారు. వరి పంట సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్య, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు సాధన, శ్రావణ్, గ్రామ సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలు

అచ్యుతాపురం రూరల్: నరేంద్రపురం గ్రామంలో శ్రీసత్యసాయిబాబా శత జయంత్యుత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో సత్యసాయిబాబా చిత్ర పటాన్ని ఊరేగించారు. అనంతరం సాయిబాబా ప్రవచనాలు బోధించే గురువులను సన్మానించారు. గ్రామ సేవా సంఘ సభ్యులు చిట్టి లక్ష్మికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక వైస్ ఎంపీపీ బోజ వెంకట్, శ్రీనివాసరావు, చందక శివ, రావి కాసు, రావి నాయుడు, చిట్టి వెంకటరమణ, చిట్టి సన్యాసినాయుడు, బద్ది లోకేష్, సుంకర రాజు, గణేష్, రావి కృష్ణంరాజు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



సేవా సంఘ సభ్యులు లక్ష్మిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

సాగునీటి మార్గాలు పునరుద్ధరించాలి

- పోలవరం కాంట్రాక్టర్లకు నాయకుల విజ్ఞప్తి
- 3 వేల ఎకరాలకు సాగునీరు అందక రైతుల అవస్థలు

నక్కపల్లి: పోలవరం కాలువ పనులు చేపట్టిన కాంట్రక్టర్ల చర్యలు కారణంగా కాలువ దిగువన ఉన్న సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందకుండా పోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువలో నీరు ఉన్నప్పటికీ దిగువన ఉన్న చెరువుల్లోకి నీరు రాక ఇబ్బంది పడుతున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని చిన రామభద్రపురం, ఒడ్డిమెట్ట గ్రామాల రైతులు మొర పెట్టుకుంటున్నారు. బుధవారం రైతులంతా కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, రైతు నాయకులు ఇందుకూరి రవిరాజు, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, మాజీ ఎంపీటీసీ దండు బలరామరాజుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాయకులు పోలవరం కాలువ పనులు చేపడుతున్న బీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. చినరామభద్రపురం సమీపంలో ఉన్న జోడిమెట్ట వద్ద పోలవరం కాలువ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు రాకుండా అడ్డుకట్ట వేశారన్నారు. గతంలో వర్షపు నీరు, గెడ్డల ద్వారా దిగువ ప్రాంతాల్లోని చెరువుల్లో చేరడంతో ఈ నీటిని వినియోగించుకుని వరి పంట సాగు చేసే వారమన్నారు. ఇటీవల పోలవరం కాలువ పనులు పునః ప్రారంభమైన తర్వాత నీటి మార్గాలు మూసి వేశారన్నారు. దీంతో చినరామభద్రపురం, ఒడ్డిమెట్ట, గొడిచర్ల, ఉద్దండపురం, కొత్తూరు తదితర గ్రామాల్లో సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఉన్న మాదిరిగా యథావిధిగా నీటి మార్గాలను పునరుద్ధరిస్తే రైతులు ఈ నీటిని ఉపయోగించుకుని వరి సాగు చేసుకుంటారన్నారు. సమస్య తెలుసుకున్న కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ హరి స్పందిస్తూ గురువారం జోడిమెట్ట వద్దకు వస్తామని, రైతులు వచ్చి సమస్య వివరిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు, కాంట్రాక్టర్‌ను కలిసిన వారిలో రైతులు సుధారాజు, పైలా నూకన్ననాయుడు, సఖిరెడ్డి వెంకటరమణ, నాని తదితరులు ఉన్నారు.



పోలవరం కాంట్రాక్టర్లకు సమస్య వివరిస్తున్న రైతు నాయకులు

సైన్స్ అండ్ టెక్నాలజీతో ఉద్యోగావకాశాలు

యలమంచిలి రూరల్: ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకుని, పరిశోధన చేస్తే యువతకు ఉద్యోగావకాశాలు ఉన్నాయని జాతీయ శాస్త్ర సాంకేతిక శాస్త్రవేత్త(జీ గ్రేడ్) డాక్టర్ శివాజీ చదరం అభిప్రాయపడ్డారు. బుధవారం యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతికశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో సైన్స్ విత్‌అవుట్ బోర్డర్స్ అంశంపై జరిగిన నేషనల్ వెబనార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై సమకాలీన ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలపై విద్యార్థులకు వివరించారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. అనంతరం శాస్త్రవేత్త చదరం శివాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రేఖా రామారావు, భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకులు పీఎస్ జగ్గారావు, కె.వెంకన్న, కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకుడు మార్టిన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ శివాజీ చదరం

వాడ్రాపల్లి ఉప సర్పంచ్ ఈశ్వరరావుకు ఘన నివాళి

మునగపాక: వాడ్రాపల్లి ఉప సర్పంచ్ కాకి ఈశ్వరరావు సంతాప సభ బుధవారం నిర్వహించారు. ఇటీవల ఈశ్వరరావు పొట్టలోకి గునపాం దూసుకుపోయిన సంఘటనలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గ్రామంలో జరిగిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ వాడ్రాపల్లి గ్రామాభివృద్ధికి ఈశ్వరరావు ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల కన్నంనాయుడు, మళ్ల రాజేష్, కొయిలాడ దశావతారం మళ్ల అప్పలనాయుడు, మళ్ల మల్లయ్యనాయుడు, పాలకవర్గ సభ్యులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



వాడ్రాపల్లి ఉప సర్పంచ్ ఈశ్వరరావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న దృశ్యం